క్లుప్తంగా

'గంగనాల' ఆయకట్టుకు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న వీడీసీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామశివారులో గంగనాల ప్రాజెక్టు ఆయకట్టుకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నీటిని విడుదల చేశారు. ముందుగా గోదావరికి పూజలు చేశారు. అనంతరం నీరును వదిలారు. ఈ నీరు విడుదలతో వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలం మొగిలిపేట, నడికుడ, ఓబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, దాంరాజ్‌పల్లి గ్రామాల పరిధిలోని 4 వేల ఎకరాలకు నీరందుతుందన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గుమ్మల గంగన్న, ఉపాధ్యక్షుడు దుంపేట మహేశ్, కోశాధికారి పుప్పాల అశోక్, వేణుగోపాల్, నరేందర్, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సరిహద్దుల్లో సేవలు అభినందనీయం


రాజేశ్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మెట్‌పల్లి: దేశ సరిహద్దుల్లో సైనికుడిగా సేవలందించడం అభినందనీయమని పలువురు అన్నారు. పట్టణానికి చెందిన రాజేశ్ ఆర్మీలో పని చేసి ఇటీవల పదవీ విరమణ చేశారు. ఆయనను ఆదివారం మోచీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సైనికుడిగా రాజేశ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బైరి రాజేశ్వర్, చింతకింది భూమయ్య, నారాయణ, సాయిచందు, ప్రకాశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి


విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మల్యాల: మండల కేంద్రంలోని మల్యాల అడ్డరోడ్డులోని బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళి అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నలువాల సంజీవ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మారంపల్లి గంగాధర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై కుమారస్వామి

సారంగాపూర్: సైబర్ క్రైమ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కందుకూరి స్వామి అనే యువకుడు కందుకూరి స్వామి ముద్రించిన పోస్టర్‌ను బీర్‌పూర్ ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సై కుమారస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పరుస్తున్న స్వామిని అభినందించారు. కార్యక్రమంలో యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతకు కృషి చేయాలి

రాయికల్: యాదవుల ఐక్యత కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్ యాదవ్ కోరారు. మండలంలోని భూపతిపూర్‌లో ఆదివారం యాదవ సంఘంలో సభ్యత నమోదు చేపట్టారు. యాదవులంతా ఐక్యంగా ఉంటూ సమస్యల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పంచతి శంకర్, బొడ్డు చిన్నమల్లయ్య, చిన్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ కష్టాలు

- రెండు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు కరువు
- విద్యుత్ కనెక్షన్లు మంజూరైనా లైన్ ఏర్పాటు చేయని అధికారులు
- విద్యుత్ అధికారి కొడుకే కాంట్రాక్టర్

జగిత్యాలరూరల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. రెండు నెలల క్రితం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో రైతులు నారుమడులు పోసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు పదేపదే చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లిలో మందోట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలల క్రితం కాలిపోయింది. దీంతో అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ కిందనున్న రైతులు నారుమడులు పోసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతుల నీరు తెచ్చుకుని నారుమడులు సాగు చేశారు. కానీ ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్లు మంజూరైనా నిర్మించని లైన్..

సోమన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు సంవత్సరన్నర క్రితం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు డీడీలు కట్టడంతో వారికి కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ ఏడాదిన్నరగా అధికారులు కేవలం స్తంభాలను మాత్రమే ఏర్పాటు చేసి లైన్లు నిర్మించకుండా వదిలిపెట్టారు. దీంతో రైతులు వందల మీటర్ల దూరం నుంచి సర్వీస్ వైరుతో కనెక్షన్లు ఇచ్చుకుని మోటార్లు నడుపుకుంటున్నారు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో కొన్ని చోట్ల లూజ్ వైర్లు ఉండగా చాలా కాలంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చేతి ఎత్తులోనే ఉన్న విద్యుత్ వైర్లు

అధికారి కొడుకే కాంట్రాక్టర్

రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కొత్త కనెక్షన్లు మంజూరైనా అధికారి కొడుకే కాంట్రాక్టర్ కావడంతో నిర్మాణ పనులు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చేపట్టిన పనులు కూడా నాణ్యతగా లేవని, అధికారి కొడుకు కాంట్రాక్ట్ పనుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగులను కూడా పనిచేయించుకుంటున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయించి నారుమళ్లను రక్షించాలని రైతులు కోరుతున్నారు.


సోమన్‌పల్లిలో రెండు నెలల క్రితం కాలిపోయి మరమ్మతుకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్

వెంటనే మరమ్మతు చేపడతాం

జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లిలో మందాటి మీది ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే మరమ్మతులు చేపడతాం. అలాగే కొత్తగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు పొందిన వారికి విద్యుత్ స్తంభాలు వేసి లైన్ వేస్తాం.
– రాజిరెడ్డి, ట్రాన్స్‌కో డీఈ


పెగడపల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం పిల్లర్లకే పరిమితమైంది. ఈ భవన నిర్మాణం కోసం ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ భవనం నిర్మాణ పనుల పిల్లర్ల వరకు జరిపి ఆపేశాడు. నిర్మాణం ఆగిపోయి ఏడాది కావస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. వసతిగృహ భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ధనుంజయ్, ఎడ్యుకేషనల్ కార్పొరేషన్ ఏఈ పెగడపల్లి, సెల్ నంబర్: 8897536486

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

హిందూ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

రాయికల్: హిందూ పరిరక్షణ ధ్యేయమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని కరీంనగర్ విభాగ్ సహకార్య వాహ రంగ స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని మూటపెల్లి, చెర్ల కొండాపూర్, మైతాపూర్ గ్రామాల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వ గురు స్థానంలో కల్పడమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమన్నారు. ముఖ్యంగా ప్రపంచ దేశాలన్నీ మన ఆచార సాంప్రదాయాలను పాటిస్తున్నాయని కానీ కొన్ని క్షుద్ర శక్తులు వాటిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని వాటిని ఎదుర్కోవడం కోసం కార్యకర్తలంతా సైనికుల ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ వేముల రాంరెడ్డి, సాహకార్యవవాహ సాయి మధుకర్, ఖండ కార్యవాహ వేల్పుల స్వామి, కార్యకర్తలు తురగ రాజిరెడ్డి, రాంగోపాల్ తిరుపతిరావు, వేణు రావు, మోహన్ రెడ్డి, జితేందర్ రెడ్డి, తోపారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగస్వామి

రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్ స్మరణలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి వసంత ముఖ్య అతిథిగా హాజరై జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన అంబేడ్కర్ ఆశయాలతో పాటు ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, శీలం ప్రవీణ్, ఆనంద రావు, బొల్లం రమేష్, దయాల మల్లారెడ్డి, అనంతుల కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న దావ వసంత

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

జగిత్యాలటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు, హిందూ జాతీయవాద నేత శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, నాయకులు నలువాల తిరుపతి, రాగిళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట లో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మల్యాల: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, సంగని రవి, బొబ్బిలి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: డాక్టర్ శ్యామ్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం మండల బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శ్యామా ముఖర్జీ చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు.

బీర్‌పూర్ ఎస్సైగా రాజు

సారంగాపూర్: బీర్‌పూర్ ఎస్సైగా సబ్బాని రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కుమారస్వామి జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజు బీర్‌పూర్ ఎస్సైగా బాధ్యతలను చేపట్టారు. గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు సహకరించాలని మండల ప్రజలను కోరారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

ధర్మపురి: అక్రమంగా ఆవులను తరలిస్తున్న సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాయపట్నం జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా లక్షెటిపేట వైపు నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 8 ఆవులు, రెండు లేగ దూడలున్నాయని వాటికి ఎలాంటి రశీదులు లేనందునా ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీపీకి వాకర్స్ అసోసియేషన్ సన్మానం

జగిత్యాలజోన్: పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల నియమితులైన బిట్ల నర్సయ్యను జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యుడైన బిట్ల నర్సయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ సురేష్, ఉపాధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాగి శ్రీధర్ రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు తక్కళ్లపల్లిలో విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

ధర్మపురి: పట్టణంలోని పశు వైద్యశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసెస్ డే కార్యక్రమం నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో 58 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మామిడాల రవీందర్ నాయకులు, వెటర్నరీ సిబ్బంది తదితరులున్నారు.

జగిత్యాలటౌన్: ప్రపంచ జునోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జగిత్యాల ప్రాంతీయ వైద్యశాలలో 125 శునకాలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి వసుపావని, వెటర్నరీ ఆఫీసర్ ఆనంద్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీలో గల్ఫ్ కార్మికుల సమస్యలను లేవనెత్తాలి

మల్లాపూర్: గల్ఫ్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని ఇండియన్ పీపుల్స్ ఫోరం(ఐపీఎఫ్) సీనియర్ నాయకుడు పెనుకుల అశోక్ కోరారు. ఆదివారం దుబాయిలో ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ రమణలను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇండియన్ పీపుల్స్ ఫోరం సభ్యులు కంబాల శ్రీనివాస్, జంగం బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి స్టీల్ ప్లేట్లు అందజేత


ప్లేట్లు అందజేస్తున్న దాత శ్రీనివాస్‌రెడ్డి

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయానికి గ్రామానికి చెందిన గుజ్జుల గోపాల్‌రెడ్డి–లక్ష్మి దంపతులు రూ. 32 వేల విలువ గల 265 స్టీల్ ప్లేట్స్‌లను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి భోజన ప్లేట్లను అందజేసిన దాతలను ఆలయకమిటీ సభ్యులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, సభ్యులు పార్థసారథి, రాజశేఖర్, వెంకటరమణ, నర్సింహరెడ్డి, మహిపాల్‌రెడ్డి, అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

మల్లాపూర్: చార్టెడ్ అకౌంట్(సీఏ) ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన మండలంలోని కొత్త దాంరాజుపల్లికి చెందిన వడ్లకొండ వాహినిని మంగళవారం కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సీబీ.అనిల్‌సింగ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సన్మానించారు. తల్లిదండ్రులు వడ్లకొండ రమేశ్–జమున ప్రోత్సాహం, విద్యార్థిని ప్రతిభతోనే సీఏ ఎంట్రన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిందన్నారు. సీఏలో ఉత్తీర్ణత సాధించి మండలానికి పేరు తీసుకువచ్చిన వాహినిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ టీచర్ షీనా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల: కరీంనగర్– జగిత్యాల ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొడిమ్యాల మండలం నమిలకొండ గ్రామానికి చెందిన బుచ్చిబాబు బంధువుల అబ్బాయితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో బుచ్చిబాబు రెండు కాళ్లు విరిగాయి. బాలుడికి తీవ్ర గాయాలుకావడంతో ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే సంజయ్ జన్మదిన వేడుకలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్లు జ్యోతి, గిరి నాగభూషణం, నాయకులు కూసరి అనిల్ పాల్గొన్నారు.

ములుగు జిల్లా పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప రుద్రేశ్వర ఆలయాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగిత్యాలరూరల్: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో, అర్బన్ మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం అయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. హన్మాన్ ఆలయంలో పూజలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో..

సారంగాపూర్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సారంగాపూర్ విండో చైర్మన్ ఏలేటి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే కు సీఎం శుభాకాంక్షలు

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేకు కవిత జన్మదిన శుభాకాంక్షలు

జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ కవిత లేఖ ద్వారా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలని కోరారు.

తొలి ఏకాదశి పూజలు

రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెగడపల్లి: తొలి ఏకాదశి పండుగ వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలన్ని భక్తులతో సందడి నెలకొంది.

సారంగాపూర్: తొలి ఏకాదశి పర్వదినం కావడంతో మండలంలోని దుబ్బరాజన్న ఆలయం, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ధర్మపురి: మొహర్రం వేడుకలను ధర్మపురిలోని నంది కూడలి వద్ద మసీద్‌లో, కట్టె మిషన్ వద్ద మసీదులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పీర్లు, లాల్వావులను స్థానిక ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం మసీదుల నుండి గోదావరి వరకు ఊరేగింపుగా తీసుకెల్లి గోదావరిలో నిమజ్జనం చేశారు.

బాలికను హత్య చేసిన వారిని శిక్షించాలి

మెట్‌పల్లి: కోరుట్లకు చెందిన ఐదేళ్ల బాలిక హితీక్షను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్, మాజీ పట్టణాధ్యక్షుడు ఖుత్బుద్దీన్ పాషా, న్యాయవాది ఆకుల మానస ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గోరింటాకు వేడుకలు

రాయికల్: పట్టణంలో ఆదివారం దుర్గా భవానీ కిట్టి పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. గోరింటాకు తయారు చేసుకుని గోరింటాకు పెట్టుకుని ఆటపాటలతో సందడి చేశారు.


రాయికల్‌లో గోరింటాకుతో మహిళలు


ఘనంగా రామరాట పోచమ్మ బోనాలు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో రామరాట పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో వీధుల నుంచి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతను పూజించినట్లు గ్రామ నాయకులు పేర్కొన్నారు. సాయంత్రం వేళ గ్రామస్తులు వనభోజనాలు చేశారు.